కథానిక

# మనసా - మనసా

**"పాతశ్రీ"**

సాయంకాలపు గాలిని స్వేచ్ఛగా పీలుస్తూ, ఇసుక తిన్నెల మీద కూర్చుని సముద్ర తరంగాల్ని అవలోకిస్తూ విశ్వం, నేనూ ఆలోచనా తరంగాల్ని సృష్టించుకొంటున్నాం. వాడి ఆలోచనా ప్రవాహం ఎటు మళ్ళిందో కాని నా ఆలోచన అంతా అంతక్రితమే ముగించిన నాకథ మీదే ఉంది. అది విశ్వానికి వినిపించి వాడి అభిప్రాయం తీసుకోవాలి. ఎంతసేపటికీ వాడు నాకథ ప్రసక్తే ఎత్తక పోవటంతో నాకు ఒళ్లు మండింది.

"ఏరా కథ చదవమన్నావా, వొద్దా?" కొంచెం కోపంగా అన్నాను.

వాడు ఉలిక్కిపడి కొంచెం పశ్చాత్తాప పడ్డట్టుగా ముఖం పెట్టి "చదువు, చదువు-మర్చిపోయాను" అన్నాడు.

జేబులోంచి కాగితాలుతీశాను.

గొంతు సవరించుకున్నాను. ఒకసారి విశ్వం ముఖంలోకికొంచెం గర్వంగా చూసి మొదలు పెట్టాను.

"శారద గడియారం..."

నవ్వు వినిపించి తలెత్తాను. విశ్వం నవ్వు ఆపుకోవాలని ప్రయత్నిస్తూ ఆపుకోలేక శ్రమ పడుతున్నాడు.

"ఏమిటి?"

"ఏం లేదులే, చదువు."

"నవ్వుతూ, ఏం లేదంటావేం?"

"శారద అంటే నవ్వొచ్చింది."

"ఎందుకు?" నేను కొంచెం ముఖం చిట్లించి అడిగాను. చదవటం మొదలు పెట్టానో లేదో అప్పుడే వెధవ రిమార్కులు. వాడు నాకంటే కొంచెం రాయగలిగి ఉండవచ్చు. వాడు రాసినన్ని కథలు రాస్తే నేనూ సునాయాసంగా వాడికంటే ఎక్కువపేరే సంపాదించుకోగలను. వీడికింత మిడిసిపాటు దేనికి?

"ప్రతివాడికీ శారదేనట్రా కథానాయిక."

వాడు ఆ మాటలు అనగానే నాకు మనసు కొంచెం చివుక్కుమంది. శారద తన అభిమాన కథానాయిక. ఆ పేరులో నాకేకాక చాలా మందికి ఎంతో ఆకర్షణ కనిపించింది.

"శారద ఆదర్శ తెలుగు కథానాయిక. ఆ పేరు ఊరికే పెట్టాననుకున్నావేమిటి? తెలుగు స్త్రీ వెన్నెలలా ఆనందమయి. ఆ పేరులో ఎంత సజెషన్ ఉందో గ్రహించక తేలిగ్గా కొట్టి పారేస్తే ఎలా?"

విశ్వం వెంటనే నవ్వు ఆపేశాడు. మానవుడు దెబ్బ తిన్నాడు. చదవటం సాగించాను.

"శారద గడియారం పెద్ద ముల్లువైపు ఆత్రంగా చూస్తోంది. పదీ ముప్పావు అవుతోంది. ఇంకా ఉత్తరాలు రాలేదు. ఆమెకి కాలాడక ఇంట్లోనుంచి వీధి గుమ్మందాకా, అక్కడినుంచి మళ్ళీ ఇంట్లోకి తిరగటం, చూపుమేర దాకా వీధిలోకి చూడటం పనిగా పెట్టుకుంది. అల్లంత దూరంలో పోస్టుమాన్ కనిపించాడు. ఆమె గుండె కొట్టుకో సాగింది. వేగంగా తనకేమైనా ఉత్తరం వచ్చిందో లేదో... అమ్మయ్య, వచ్చింది. కవరు. గబగబ లోపలికి పోయి కవరు చింపింది. కింద సంతకం చూసి వెంటనే చిన్నబోయింది. ఆ ఉత్తరం తన స్నేహితురాలు రాసింది. ఆమె వివాహంట. రేపే... ఇంత ఆలస్యంగా రాసినందుకు క్షమించి తప్పకుండా, మరేం కుంటి కారణాలు చెప్పకుండా వెంటనే భర్తతో సహా! రేపల్లెకి వచ్చేయాలిట. భర్తతో సహా! శారద నిట్టూర్చింది. అనవసరంగా, అహంభావంతో, కేవలం చిలిపిగా ఆయనతో పోట్లాడింది. తెగేదాకా లాగింది. సామాన్యంగా ఆయనే తగ్గేవాడు. ఈసారి అలా జరగలేదు. పట్టుదలకోసం- కేవలం మాట పట్టింపుకోసం పుట్టింటికి వచ్చేసింది. నెలరోజులు గడిచిపోయాయి. ఉత్తరం ముక్కలేదు అక్కడినించి ఇక్కడికీ, ఇక్కడనించి అక్కడికీ. ఇలాంటి పరిస్థితుల్లో భర్తతో సహా ఎలా వెడుతూంది శ్యామల పెళ్ళికి? వెళ్ళకపోతే పాపం అది చాలా చిన్నబో

తుంది. చిన్నప్పటినించీ కలిసి తిరిగారు. రెండేళ్ల క్రితం వాళ్ళ నాన్నకి ట్రాన్స్‌ఫర్ అయేదాకా తన ఇంటి పక్కనే ఉండేవాళ్లు. వెళ్లకుండా ఉండటానికి మనసొప్పటం లేదు. వెంటనే తెనాలి వెళ్ళి భర్తతో సహా...అసంభవం. తనంతట తను రాజీకి రావటం తన ఆత్మాభిమానానికి ఎంత దెబ్బ!...ఒంటరిగానే వెళ్ళి ఏదో సాకు చెప్పాలి. కాని, ఎన్నాళ్ళిలా..."

"ఎలా ఉంది ప్రారంభించటం?"

"పూర్తిగా చదువు."

"ఇంతవరకు సస్పెన్సు, టెక్నిక్ యెలా ఉన్నాయో చెప్పు!"

"బాగానే ఉందిలే."

తిట్టలేక మెచ్చుకుంటున్నట్టుగా మాట్లాడుతున్న వాడి ధోరణి చూస్తే నాకు అరికాలి మంట నెత్తికెక్కింది. నిజానికి ప్రారంభించటం అద్భుతంగావుందని నా వ్యక్తిగత అభిప్రాయం. వాడికి ఈర్ష్య, మరేమిటో చెప్పలేను మరి... మళ్ళీ చదవటం మొదలుపెట్టాను.

"తెనాలి స్టేషన్ ప్లాట్‌ఫారంమీద రైలు ఆగింది. మూర్తి వెంటనే ఇంటర్ క్లాస్ పెట్టె కోసం వెతుక్కుంటున్నాడు. ఇంటర్ క్లాస్ సమీపించేసరికి మూర్తి ముఖంలో ఆశ్చర్యార్థకం తాండవించింది. అసంభవం సంభవమౌతుందని అతను కలలో కూడా అనుకుని ఉండలేదు. శారద అప్పుడే రైలు దిగి పోర్టర్ కోసం ఎదురు చూస్తోంది. ఆ క్షణంలో మూర్తిహృదయంలో వెనుగాలులు వీలు చూసుకుని విజృంభించాయి. పాపం, శారద! ఇంకా ఆమె తనని చూడలేదు ఆ జన సమ్మర్దంలో. పిచ్చి శారద. తను ఉత్తరం రాస్తాడేమోనని ఎంతో ఎదురుచూసి ఉంటుంది. ప్రతి రోజూ నిరాశ చెందివుంటుంది. ఎంత కర్కశంగా, రాక్షసుడిలాగా ప్రవర్తించాడు తను! అభిమానం చంపుకుని చివరికి ఆమే లొంగింది స్త్రీహృదయం నవనీతకోమలం. న్యాయంగా స్త్రీలకి ఆత్మాభిమానం ఎక్కువ. తను అది కనిపెట్టలేక దుర్మార్గుడై ఆమెతో పంతం పెట్టుకుని ఎంత బాధించాడు! నిజానికి శారదలేని ఈ నెలరోజులూ తను ఎంత నరకం అనుభవించాడు. వెధవపట్టింపు వెనక్కి లాగక పోతే ఈపాటికి ఎప్పుడో పోయి ఆమెని బతిమాలి మళ్ళీ ఇంటికి తీసుకొచ్చేవాడు. ఇంకా నయం, తను నిన్ననే బాపట్ల వెడదామనుకున్నాడు. వెళ్ళి ఉంటే ఆ రిజిస్ట్రార్ ఆఫీసులో పని కనీసం మూడు నాలుగు రోజులైనా పట్టిఉండేది. పిచ్చి శారద ఇంటికి వొచ్చి తలుపు తాళంవేసి ఉండటం చూసి ఎంత గాభరాపడేదో! ఎంత పశ్చాత్తాప పడేదో! ఇంకా ఆమె మనసు మరోవిధంగా పోయి... ఓ. ఆ తలంపే వాళ్లు జలదరింప చేస్తోంది. దేవుడనే వాడివల్ల ఈ ఆపద తప్పింది.

హృదయంలో అనురాగం కట్టలు తెగి ప్రవహిస్తుండగా మూర్తి శారదముందుకి వెళ్ళి నిలబడి, "శారదా" అన్నాడు ఆప్యాయంగా.

ఇప్పుడు ఆశ్చర్యార్థకం మూర్తి ముఖంనించి బయటపడి ప్రశ్నార్థకాన్ని కూడా కలుపుకుని శారద ముఖంలో లీనమైంది.

ఆమె మనసు పరిపరి విధాల పోయింది. మూర్తి బెజవాడకి తనకోసమే వొస్తున్నాడని నిశ్చయించుకోటానికి ఆమెకి ఎక్కువ సేపు పట్టలేదు. ఇంకా ఎక్కడికి వెడతారు? ఆయన మనసు తనకి తెలియంది అయితే కదా! ఆయనకి అసలు పరాయి ఊళ్ళలో పనులేముంటాయి? వెడితే ఎప్పుడైనా మద్రాసుకేగాని ఇంక ఎక్కడికీ వెళ్ళరు. అదీ ఎప్పుడో సంవత్సరానికో సారి. వెళ్ళినప్పుడల్లా ఓ పదిరోజులు మకాం. ఇప్పుడు దగ్గర సామాను ఏదీ లేదు, ఓ చిన్న సంచీ తప్ప. కాక అనుమానం ఎందుకు? బెజవాడకే. తను ఇన్నాళ్ళనుంచీ ఎంత అపోహపడ్డది!...ఆమె కళ్ళలో నీళ్లు తిరిగాయి, ఆమె ఏమీ మాట్లాడలేకపోయింది. అతనివైపు నీళ్లు నిండిన కళ్ళతో అలాగే చూసింది. మూర్తి హృదయం నీరైంది.

"నువ్వు నన్ను విడిచి ఉండలేవని నాకు తెలుసు శారదా! ప్రతిరోజూ నువ్వు వొస్తావని ఎదురు చూస్తూ గడిపాను. ఇన్నాళ్ళకి వొచ్చావు."

"ఇవాళ నేను రాకపోతే మీరే వొచ్చేవారు కదా!" అంది శారద. మూర్తికి ఆమె మాట్లాడింది మొదలు అర్థంకాలేదు. తరవాత అర్థమయింది. కాని అతనేమీ మాట్లాడలేదు.

ఇద్దరూ టికెట్లు ఇచ్చి బయటికి

వొచ్చారు. ఒక టికెట్ రేపల్లెకీ, మరోటి బాపట్లకీ ఉండటం చూసి తెనాలి టికెట్ కలెక్టర్ వాళ్ళిద్దరివైపూ అర్థంకాని చూపులు చూశాడు."

చదవటం ముగించి విశ్వంవైపు చూశాను, "ఎలా ఉంద"న్నట్టు. వాడేం మాట్లాడలేదు. నోరువిడిచి అడిగాను. "ఎలా ఉంది?" వాడు ముభావంగా "ఊఁ" అన్నాడు. నాకు చెడ్డ కోపం వచ్చింది. ఏమిటి వీడి అభిప్రాయం? "బావుంది" అని అనలేకపోయినా కనీసం "బాగానే ఉంది" అనయినా అనడేం?

"ఊఁ ఏమిటి? బావుంటే బావుందనీ, లేకపోతే లేదనీ చెప్పరాదూ?" "ముగింపు మార్చరాదూ?" "ముగింపు గొప్పగా చేశాననుకుంటున్నాను. ఆర్టిస్టిక్‌గా లేదంటావా?"

"ఉందిలే."

అసంతృప్తిగా ఉన్నట్టు వాడి ముఖమే చెబుతోంది. "ఎలా మార్చమంటావు?" మార్చటం ఇష్టంలేకపోయినా అడిగాను.

"రచనలో 'లోపం' ఎత్తి చూపించటంతో పాటు సందేశంకూడా ఉంటే రాణిస్తుందనుకుంటాను."

"ఎలా మార్చమంటావో చెప్పరాదూ!"

"చివరిపేరా కొట్టెయ్యి."

"కొట్టేసి...?"

"ఇలా రాయి."

విశ్వం ఇలా కలిపాడు.

"ఎప్పుడో మీరు తప్పక వొస్తారనే అనుకుంటున్నాను. మీ సంగతి నాకు తెలుసు. అంతా పైపటారమే." చిరునవ్వుతో అంది శారద. మూర్తికి ఏమనాలో తోచలేదు. అతనిలో విరుద్ధభావాలు పోట్లాడుకోటం మొదలుపెట్టాయి. తను బెజవాడకి బయలు దేరలేదని చెప్పేస్తే తన విజయం నిరూపించుకో వొచ్చు. కానిఆమెమనసు ఎంత దెబ్బతింటుంది. అలా అని చెప్పకపోతే ఆమెని తెలిసికూడా మోసగించటం.

మూర్తి ముభావం శారదకి అర్థం కాలేదు. ఇంతవరకూ సరదాగా మాట్లాడుతున్న అతనిలా అకస్మాత్తుగా ముఖకవళికలు మార్చటం శారద గమనించినా అందుకు కారణం ఏమయి ఉంటుందో ఊహించలేకపోయింది. బహుశా అతను పరాజయం పొందాడని కించపడుతున్నాడా? తనుకూడా పరాజయం పొందినట్టే అతను భావించుకుంటున్నాడు కదా, మరి? ఇహ బాధ పడాలిసిన అవసరమేముంది?... తను బుద్ధిపూర్వకంగా అతనినిలా వంచించటం యుక్తమా? నిజం చెప్పేస్తే...? అతను మనసు మార్చుకొంటాడేమో. అప్పుడు మరింత ఎక్కువగా తన ఓటమి ఆయనని బాధిస్తుంది కదా! ఏమయినా నిజం చెప్పి, క్షమించమనీ, ఇహ ఎప్పుడూ ఆయనని వొదిలి ఉండననీ ప్రార్థించటం అన్నివిధాలా మంచిది. ఎంతకాలం ఆయనని నిజం నించి దూరంగా ఉంచగలదు?—ఉంచినా ఆత్మతృప్తి యెలా లభిస్తుంది?

శారద హాండ్ బ్యాగ్‌లోంచి టికెట్ తీసింది. మూర్తిచేతి కందించింది. మూర్తి దాని వైపు చూడకండా చేతిలో ఉంచుకొన్నాడు అప్రయత్నంగా.

"శారదా."

"ఏమిటి?"

"నువ్వు నన్ను క్షమించాలి. నీ పట్ల చాలా అనుచితంగా ప్రవర్తించాను."

"ఆ మాటలు అనాలిసింది నేను."

"ఎలా అనుకొన్నా, నాకంటే నువ్వే ముందుగా ఆదర్శవంతంగా ప్రవర్తించావు. ఈ టికెట్ చూడు." మూర్తి తన చేతిలో టికెట్ శారదకిఅందించాడు. అది బాపట్లకి ఇంటర్ క్లాస్ టికెట్. శారద తెల్లబోయింది. కాని వెంటనే సర్దుకుని అంది. "మీ చేతిలో టికెట్ కూడా చూడండి" మూర్తి శారద ఇచ్చిన టిక్కెట్ చూశాడు. అది రేపల్లెకి ఇంటర్ టిక్కెట్. "నా స్నేహితురాలు శ్యామల పెళ్ళట. మీతో కూడా రమ్మంది... కాని..."

మూర్తి నవ్వాడు. శారద కూడా నవ్వింది.

"బాపట్ల ఎందుకు?"

"డెప్యూటీ రిజిస్ట్రార్ ఆఫీసులో పనుంది"

మళ్ళీ శారద నవ్వింది. మూర్తి కూడా నవ్వాడు. ఆ నవ్వుల కలయికలో నిష్కల్మషమైన మనసూ, మనసూ ఏకమయాయి."

"ఎలాఉంది అన్నాడు?" విశ్వం.

"మళ్ళీ చెప్తా రాస్తాను" అన్నాను.